RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 148

మంగళవారం
మే 06, 2025

పేజీలు : 4
వెల : రూ.3-00



సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

4లో..





# గింత నిర్లక్ష్యమా?



- గర్భిణి కడుపులో ప్యాడ్ పెట్టి మరిచారు!
- చెవిలో బ్లూటూత్ పెట్టుకుని ఫోన్ చూస్తూ.. డెలివరీ చేశారా?
- ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగిన నిర్లక్ష్యంతో ప్రాణాపాయ స్థితికి మహిళ
- కమలాపూర్ సర్కారీ హాస్పిటల్ నిర్వాకంపై కలెక్టర్ సీరియస్.. ఎంక్వయిరీకి ఆదేశం

**వేద న్యూస్, కమలాపూర్:**

కొందరు వైద్యుల నిర్వాకంతో మొత్తం సర్కారీ వైద్య వ్యవస్థకే మచ్చ ఏర్పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. తాజాగా హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం ఖరీదు బాధితురాలి ప్రాణపాయ స్థితికి చేరే వరకు వెళ్లడం గమనార్హం. సదరు ఘటనపై జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశాలివ్వడంతో నిజానిజాలు తేల్చి.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ఘటన వివరాల్లోకెళితే..కమలాపూర్ మండల పరిధిలోని ఉప్పల్ గ్రామానికి చెందిన వానరాశి తిరుమల అనే మహిళ నిండు గర్భిణి.. డెలివరీ కోసమని గతవారం కమలాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చింది. పరిశీలించిన వైద్యులు ఆపరేషన్ చేసి శిశువును క్షేమంగా బయటకు తీశారు. కానీ నవజాత శిశువును బయటికి తీసిన అనంతరం కడుపులోనే పొడవాటి ప్యాడ్ ముక్కను ఉంచి.. అలాగే కుట్లు వేసి ఇంటికి పంపించారు. వారం రోజుల తర్వాత డెలివరీ అయిన మహిళకు కడుపులో తీవ్ర నొప్పి రావడంతో అదే ఆస్పత్రికి బంధువులు తీసుకొచ్చారు. అక్కడ కుట్లు విప్పి చూసేసరికి కడుపులో లోపలే పొడవాటి ప్యాడ్ ముక్క అలాగే ఉంది. అది గమనించిన సదరు మహిళ బంధువులు వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

### చెవిలో బ్లూటూత్ పెట్టుకుని డెలివరీ?

మహిళ బంధువులు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు నిర్లక్ష్యంగా పనిచేస్తున్నారని, డెలివరీ అయ్యే సమయంలో కూడా చెవిలో బ్లూటూత్ పెట్టుకొని మొబైల్ ఫోన్ చూస్తూ నిర్లక్ష్యంగా ఆపరేషన్ చేసి కడుపులోనే ప్యాడ్ పెట్టి మరిచిపోయారని, దాంతో బాలింత ప్రాణాపాయ స్థితి వరకు వెళ్లి బయటపడిందన్నారు. ఒకవేళ ప్రాణం పోతే పరిస్థితి ఎలా ఉండేదని, వైద్యులకు ప్రాణాలు అంటే లెక్క లేదని, పూర్తి నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వం వీళ్లకు జీతాలు ఇచ్చేది మనుషులకు ప్రాణాలు పోయడానికా? ప్రాణాలు తీయడానికా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### 'ఎక్కువ మాట్లాడకండి' అంటూ సిబ్బంది దబాయింపు

వైద్యులు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై ప్రశ్నిస్తే 'ఎక్కువ మాట్లాడకండి' అని వారు దబాయిస్తున్నారని బంధువులు ఆరోపించారు. ఆసుపత్రిలో బాలింత బంధువులు ఆందోళన చేస్తున్న సమయంలో డ్యూటీలో ఉన్న డాక్టర్‌ను ఈ ఘటనపై వివరణ కోరగా, ఆయన సంబంధిత డాక్టర్ రేపు వస్తారని, వచ్చాక పూర్తి క్లారిటీ వస్తుందని, వాస్తవానికి ఆపరేషన్ చేసి కడుపులో ప్యాడ్ మర్చిపోవడం అంటూ జరగదని.. కొన్ని సమయాల్లో కొందరికి బ్లీడింగ్

మిగతా 4వ పేజీలో..



# 'నన్ను కోసినా, రూపాయి రాదు..'

## చేతులెత్తేసిన సీఎం రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

తెలంగాణలో ఉద్యోగ సంఘాలు "ఇక సమరమే" అని ప్రకటించడంతో, సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని, ఉద్యోగుల విధేయతను ప్రస్తావిస్తూ ఆయన మాట్లాడుతూ.. ఈ సమరం ప్రభుత్వంపై కాదని, ప్రజలపై చేసేదిగా నిలుస్తుందన్నారు. తెలంగాణలో పరిస్థితులు రోజు రోజుకీ ఉద్రిక్తంగా మారుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ఉద్యోగ సంఘాలు తీవ్ర అసంతృప్తితో రోడ్డెక్కిన తరుణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెద్ద దుమారమే రేపుతున్నాయి. "ఉద్యోగులు సమరం చేయడం ప్రజలపై యుద్ధం చేయడమే" అన్న ముఖ్యమంత్రి మాటలపై ఉద్యోగ సంఘాలలే కాకుండా, సామాన్య ప్రజలు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తాము గడచిన పది ఏళ్ల పాలనను విమర్శిస్తూ అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు అదే గతి తమ పాలనకు వస్తే, ఉద్యోగులను, ప్రజలను తప్పుబట్టడం ఎంతవరకు సమంజసం? ఉద్యోగులు జీతాలు ఆలస్యం అవుతున్నాయని, పెన్షన్ బకాయిలు క్లియర్ చేయాలంటూ చేసే పోరాటాన్ని 'ప్రజలపై యుద్ధం'గా చిత్రించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

"నన్ను కోసినా ఈ రాష్ట్రానికి 18,500 కోట్లకంటే ఎక్కువ ఆదాయం లేదు. కానీ ఖర్చులు మాత్రం 22,500 కోట్లు కావాలి. ఇప్పుడు చెప్పండి... ఏ పథకం ఆపాలి? బోనస్ తీసుకుందామా? విద్యుత్ సబ్సిడీ తీసివేయాలా? వంద రూపాయల పెట్రోల్ రెండు వందలుగా మారిందంటే ఊహించగలరా? ఏం చేద్దాం చెప్పండి..." అంటూ సీఎం ఆవేశంగా స్పందించారు. "ఈ స్థితిలో ధర్నాలు, దీక్షలు చేస్తే ఉన్న ప్రభుత్వ వ్యవస్థ కుప్పకూలిపోతుంది. ఆర్థికంగా దివాలా రాష్ట్రంగా మారిపోతాం. అప్పు కూడా పుట్టట్లేదు. ఢిల్లీలో

మిగతా 4వ పేజీలో..

# ఇంటర్మీడియట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



మిర్యాలగూడ నియోజకవర్గం దామరచర్ల మండల పరిధిలోని బొత్తలపాలెం గల తెలంగాణ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు 2025-2026 విద్యా సంవత్సరానికి 10వ తరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ నరహరి నేడొక ప్రకటనలో తెలియజేశారు.ప్రథమ సంవత్సరానికి గ్రూపుల వారిగా ఎంపీసీలో:40 సీట్లు, బైపీసీలో:40 సీట్లు,ఎంఈసిలో:40 సీట్లు, సీఈసీలో:40 సీట్లు మొదలగు వాటికి సీట్లను భర్తీ చేస్తామని తెలియజేశారు.ఈ అవకాశం ఈనెల 5వ తేదీ నుండి 20 తేదీ వరకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపిక చేయబడిన విద్యార్థుల జాబితాను ఈనెల 25వ తేదీన కళాశాల నోటీస్ బోర్డ్ లో ప్రదర్శింపబడుతుందని తెలిపారు.ఎంపికైన విద్యార్థుల యొక్క సర్టిఫికెట్ల వెరిఫికేషన్ 27వ తేదీ నుండి 31 వరకూ పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ, నోట్ బుక్స్, సువిశాలమైన ఆటస్థలం,తరగతి గదులు, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు డిజిటల్ బోర్డ్ ద్వారా విద్యబోధన చేయడం జరుగుతుందని, పోటీ పరీక్షలకు సన్నతమైన విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహించడం జరుగుతుందని, వృత్తివిద్య కోర్సులు మరియు బ్యూటీ వెల్నెస్,బాలికలకు హాస్టల్ సదుపాయం, స్కాలర్షిప్స్ సదుపాయం కలదని విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ తెలియజేశారు.

## యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్

# భూ నిర్వాసితుల ఆందోళన

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోని న్యాయం చేయాలి అని ఆందోళన చేశారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజక వర్గంలోని దామరచర్ల మండలం మోదుగుల కుంట తండా,కపుర తండా గ్రామస్తులు ఆర్ అండ్ ఆర్ సెంటర్ కింద 2020/2021లో 180 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు శాంక్షన్ చేశారు.తండా వాసులను మోసం చేసి అగ్రిమెంట్ రాసి ఇచ్చిన మాజీ సర్పంచ్,ఆయన కుటుంబ సభ్యులు గ్రామ ప్రజలను మోసం చేసి డబుల్ బెడ్ రూమ్ కాంట్రాక్ట్ దక్కించుకున్నాడని ఆరోపణ చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి విడుదల అయిన ఇండ్లు 180 కాగా ప్రస్తుతం పూర్తయిన ఇండ్లు 101. ఒక్కొక్క ఇంటి లబ్ధిదారుల నుంచి అక్రమంగా రూ.5500లు కాంట్రాక్టర్ వసూలు చేశాడని ఆరోపణ చేశారు.ఒక్కొక్క లబ్ది దారునికి రావలసిన మొత్తం రూ.5,04,000 కాగా కొంతమంది లబ్దిదారులకు ఒక్కొకరికి ఇచ్చిన మొత్తం రూ.4,00,000 లు ఇంకా లబ్దిదారులకు ఒక్కొకరికి రావలసిన మొత్తం రూ.1,09,500 లు అని, రావలసిన మొత్తం డబ్బులను అడిగితే మాపై దాడికి తెగబడుతున్నారని వాపోతున్నారు.గతంలో జిల్లా కలెక్టర్,సబ్ కలెక్టర్,తాహసిల్దార్ తదితర అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సదరు కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



# మున్సిపల్ కమిషనర్‌కి వినతి

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

మహేశ్వరం నియోజకవర్గ బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ లో పనులు ఆలస్యం కావడానికి కారణమేమిటి అని బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు రామిడి వీర కర్ణ రెడ్డి ప్రశ్నించారు. సోమవారం నాడు ఆయన బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సరస్వతి కి వినతి పత్రం అందజేసిన అనంతరం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. బడంగ్ పేట మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో కొన్ని డివిజన్లలో మాత్రమే పనులు జరుగుతున్నాయని మరికొన్ని డివిజన్లో మందకొడిగా కొనసాగుతున్నాయని ఆరోపించారు. కొన్ని టెండర్లు అయినప్పటికీ ఇప్పటివరకు పనులు పూర్తి కాలేదని ఆరోపించారు.

కొన్ని పనులు టెండర్లు పూర్తి అయిన పనులు ప్రారంభించలేదని సదర్ కాంట్రాక్టర్లను సంప్రదించినప్పుడు అధికారులు లేదని సమాధానం వచ్చిందని అన్నారు. గతంలో చేసుకున్న తీర్మానాలకు ఇప్పటివరకు టెండర్ ప్రాసెస్ కాలేదని దీనిపై కమీషనర్ త్వరలో చర్యలు తీసుకోవాలని అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లతో చేయించాలని వినతిపత్రం అందజేసినట్లు రామిడి వీరకర్ణరెడ్డి తెలిపారు.

# ప్రభుత్వ పథకాలన్నీ అధికార పార్టీ కార్యకర్తలకేనా..?

**వేద న్యూస్, కమలాపూర్ :**



ఇందిరమ్మ ఇండ్లు పథకానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరుగుతున్నాయని, కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన నాయకులకు, కార్యకర్తలకు, వారి బంధువులకు ఈ పథకంలో లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారని, ఆ విధంగా చేయాలని కూడా అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని భారతీయ రాష్ట్ర సమితి సీనియర్ నాయకులు తక్కళ్లపల్లి సత్యనారాయణ రావు ఆరోపించారు. అక్కకు, మన బావకు, మన బావమరిదికి, మన దగ్గర దోస్తులకు ప్రభుత్వ పథకాలన్ని పంచుడే ప్రజా పాలనా? అని ఎద్దేవ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ ముఖ్య నాయకులు దీనికి సమాధానం చెప్పాలని ఇది ఎంతవరకు కరెక్టో ఒక్కసారి గుండె మీద చేయి వేసుకొని ఆలోచించాలని కోరారు. ప్రభుత్వం, కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యవహారాలన్నిటిని ప్రజలు జాగ్రత్తగా గమనిస్తున్నారని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టడం గ్యారంటీ అని హెచ్చరించారు. తమ పార్టీ అధినాయకుడు కెసిఆర్ అన్నట్లుగా మీరేదో మొగోళ్ళు అనుకొని మొలకలుక దానికి రమ్మంటే ఎలుకను చూసి ఎల్లెలుకల పడ్డట్టుగా కాంగ్రెస్ ముఖ్య నాయకుల వ్యవహారం ఆ తీరుగా ఉందని, అలాగే రాకరాక కాంగ్రెస్ నాయకులకు అధికారం వస్తే అర్ధరాత్రి లేచి భార్యని ఏమనాలో, తల్లిని ఏమనాలో తెలియని రోజులొచ్చాయని వ్యంగ్యంగా విమర్శించారు. వందకు వంద శాతం గ్రామసభలు నిర్వహించి, గ్రామసభ తీర్మానం మేరకు అర్హులైన లబ్ధిదారులను ఫైనల్ చేయాలని, పార్టీలకతీతంగా నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వం ఇచ్చిన జీవో లోనే ఉందని, అలా కాకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, వారి బంధువులకు ప్రభుత్వ పథకాలన్నీ పంచుతూ పోతాం అని అంటే చూస్తూ

మిగతా 4వ పేజీలో..

వేద న్యూస్

మంగళవారం, మే 06, 2025

# బిజెపి మండల రథాసారధిగా పారెల్లి మహేష్ ఎన్నిక



**వేద న్యూస్, కోదాడ/చిలుకూరు :**

సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల బిజెపి అధ్యక్షుడుగా పారెల్లి మహేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ తనపై బాధ్యత పెట్టి తన నియామకానికి సహకరించిన రాష్ట్ర పార్టీ అధ్యక్షులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి,మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ గారికి,జిల్లా పార్టీ అధ్యక్షులు చల్లా శీలతరెడ్డి,రాష్ట్ర నాయకులు మల్లెబోయిన అంజి యాదవ్ కి,కనగాల నారాయణ,వెంకటేష్ యాదవ్,అక్కిరాజు యశ్వంత్,వంగవీటి శ్రీనివాసరావు, యధా రమేష్,నూనె సులోచన బొలిశెట్టి కృష్ణయ్య,జల్లా జనార్ధన్,ఓరుగంటి కిట్టు, మండల ముఖ్య నాయకులు మోదుగు శ్రీనివాసరెడ్డి,బత్తిని శ్రీనివాస్,నాగాచారి, మట్టయ్య,గణపారపు నాగరాజు, కొండ శీను, కట్టెకోల వెంకన్న, పిట్టల కార్తీక్,రామినేని నరసింహారావు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ శాఖ ఏకగ్రీవ ఎన్నిక


**వేద న్యూస్, మోతె ప్రతినిధి :**



బుర్కచర్ల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులుగా నిమ్మరబోయిన గోపి, ఉపాధ్యక్షులుగా కొండ ప్రసాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ధరావత్ రవి గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కాసాని సిద్ధార్థ గౌడ్ లను ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు అందరికి సమక్షంలో ఎన్నిక జరిగింది.సీనియర్ నాయకులు అన్నం ఇంద్ర రెడ్డి, మూల్కూరు మసూదన్ రెడ్డి, కట్ట శేఖర్ రెడ్డి కొండ వెంకన్న, బొమ్మగాని వెంకటేశ్వర్లు, గుండ్ల నాగయ్య, నిమ్మరబోయిన గంగయ్య, కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# నిస్వార్థ సేవకు నిలువెటెత్తు అద్దం పెండ్యాల వైష్ణవి ప్రసాద్

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి:**



నిస్వార్థ సేవకు నిలువుటెత్తు అద్దం 'పెండ్యాల వైష్ణవి ప్రసాద్". హైదరాబాదు నగరంలో కొత్తపేట సమీపంలోని వోమిని హాస్పటల్ నుండి నేరుగా వెడితే మోహన్ నగర్ జండా వస్తుంది. అక్కడి నుండి 10 అడుగులు ముందుకు వెళితే అద్భుతంగా కనిపించే బాలాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమాన్ ముఖ ద్వారం మరి పది అడుగులు ముందుకు వెళితే అద్భుతమైన గోశాల. ఆ ముందుకు వెడితే సామాన్య భవనం వైష్ణవి నివాస్. పెండ్యాల వైష్ణవి ప్రసాద్ స్వగృహం. నిస్వార్థ సేవకు నిలువెత్తుట ద్దంగా వైష్ణవి ప్రసాద్ గోచరిస్తారు. ఎన్నో సంవత్సరాల నుండి హైదరాబాదు నగరంలో ఎన్నో సామాజిక సేవలు చేస్తూ ఉదర పోషణార్థం "వైష్ణవి క్యాటరింగ్" నిర్వహిస్తూ వేలాదిమంది నిరుద్యో గులకు ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు ప్రసాద్. సమాజ ంలో చిన్న చూపుకు గురి అవుతున్న బ్రాహ్మణ కుటుంబాలకు ఎంతోమందికి ఆర్థిక సహాయం అందజేయడమే కాక, పేద బ్రాహ్మ ణులు వివాహం చేసుకుంటే వారికి ఉచితంగా మరికొం తమందికి, వారి బడ్జెట్లో విందు భోజనం అందజేస్తూ ఎంతోమంది పేద బ్రాహ్మణ కుటుంబాల కు వివాహాలు జరిపించిన నేపథ్యం ఆయ నది. బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికలు, బ్రాహ్మణ సమాజ సమా వేశాలలో ఉచిత క్యాటరింగ్ అందజేయడమే కాకుండా అన్ని కులాలు వర్గాలను సమానమైన దృక్పథంతో చూస్తూ ప్రజాసేవలో మమేకం కావాలని గత పార్లమెంటు ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలు అయినా, కృంగిపోకుండా అటు క్యాటరి ంగ్ ఇటు గోశాల నిర్వహిస్తూ, ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నా రు. మానవత్వం మూర్తిభవించిన మంచి మనిషిగా ప్రతి మనిషి ఆకలి అనే రోగంతో బాధపడకుండా ఉండాలని వారి కడుపులు నింపుతున్న మహా మనిషి వైష్ణవి ప్రసాద్. మూగజీవాల పట్ల తనకు న్న అభిమానాన్ని చాటుతూ ఆ జీవాలకు పేర్లు పెడుతూ ఆ పేర్లతో వాటిని పిలుస్తూ ఆయన పిలుపుతో అవి ఆస్వాదించ డం అద్భుతం. (వైష్ణవి ప్రసాద్ గోశాల గురించి మరొక సంచికలో ఇస్తాం) పేదవారి వివాహాలు ఇతర శుభకార్యాలకు వారి బడ్జెట్లో అందజేస్తూ, నిష్ణాతులైన, క్రమశిక్షణ కలిగిన సిబ్బందితో అద్భుతంగా "వైష్ణవి కేటరింగ్" కేవలం ఉభయ తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా వివిధ దేశాలకు తమ విందు భోజనాన్ని పంపిస్తూ వైష్ణవి ప్రసాద్ దేశ విదేశాల నుండి ప్రశంసలు అందుకుంటున్నారు.

# ఘనంగా నిజ దేవుడు యేసుక్రీస్తు మినిస్ట్రీస్ వార్షికోత్సవ వేడుకలు

**వేద న్యూస్, సూర్యపేట ప్రతినిధి:**



కేతపల్లి మండలం లోని భీమవరం గ్రామంలో బ్రదర్ థామస్ ఆధ్వర్యంలో నిజ దేవుడు యేసుక్రీస్తు మినిస్ట్రీస్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మే నెల ఒకటో తారీకు నుండి 5వ తారీఖు నాలుగు రోజులు చర్చిలో స్వస్థత ప్రార్థనలు జరుగుతాయని ఐదవ రోజు సోమవారం నాడు పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించుకుంటామని ఈ చర్చి వేడుకలకు చుట్టుప్రక్కల గ్రామాల నుండి కాకుండా సుదూర ప్రాంతాల నుండి వివిధ జిల్లాల నుండి ప్రజలు విశ్వాసులు వివిధ సంఘాలలో సేవ చేస్తున్న పాస్టర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ తామస్ మాట్లాడుతూ ప్రపంచ మానవాళి కొరకు యేసుక్రీస్తు ప్రభువుల వారు భూలోకంలో పుట్టి ప్రజల పాప పరిహారం కొరకు సిలువలో మరణించి 3వనాడు తిరిగి లేచిన యేసుక్రీస్తు గొప్ప దేవుడిగా ప్రపంచ దేశాలలో యేసు క్రీస్తును ఆరాధిస్తారని భూలోక ప్రజల సర్వ పాపాలను క్షమించి విమోచించి ప్రభు ప్రపంచానికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ఇలాంటి వేడుకలు ప్రజలలో భక్తి భావం ఆధ్యాత్మిక జీవితాన్ని పెంపొందిస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ప్రజల అధిక సంఖ్యలో పాల్గొని ప్రభువును ఆరాధించారు. అనంతరం ప్రజలకు ప్రేమ విందు భారీగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ చర్చిలలో సేవ చేస్తున్న పాస్టర్లు విశ్వాసులు ప్రజలు స్థానిక సంఘస్తులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టు సిద్ధాంతకర్త కారల్ మార్క్స్




**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

ధనిక పేద తేడాలు లేని సమ సమాజ నిర్మాణమే ధ్యేయంగా కమ్యూనిస్టు సిద్ధాంతం పనిచేస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. సోమవారం సిపిఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్లో కారల్ మార్క్స్ 207వ జయంతిని నిర్వహించిన సందర్భంగా కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలవేసి మేకల రవి మాట్లాడారు. సమాజంలోని అన్ని రకాల సమస్యలు పెట్టుబడిదారీ విధానం వల్లనే వస్తున్నాయని దానికి ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని రూపొందించిన కారల్ మార్క్స్ ప్రపంచానికే దిక్సూచిగా నిలిచాడని అన్నారు. అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొని అవిశ్రాంతంగా కృషిచేసి తన జీవితం ప్రపంచానికి అంకితం చేసిన కారల్ మార్క్స్ మహనీయుడని, ఏంజెల్స్ సహకారంతో తుది శ్వాస వరకు అంతరాలు లేని సమాజ నిర్మాణం కోసం కమ్యూనిస్టు పార్టీ అవసరాన్ని ప్రజలు గుర్తించేలా శ్రమించారని అన్నారు. మార్క్సిజమ్ వెలుగులో మనదేశంలో అన్ని వర్గాల ప్రజలు ఉద్యమిస్తే సమసమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అందుకోసం కారల్ మార్క్స్ స్ఫూర్తితో మరో స్వతంత్ర పోరాటానికి ప్రజలంతా సిద్ధం కావాలని తమను తామే విముక్తి చేసుకోవాలని కమ్యూనిస్టు సిద్ధాంతమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.కె భాష్మీయా, పనాస ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్,గుంపెల్లి మునీశ్వరుడు,దండు లక్ష్మణ్,సంగి ఎలేందర్ జిల్లా సమితి సభ్యులు ఎండి అక్బర్, నాయకులు ఎండి యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న శృతిలయలు అభినందన మందారమాల

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

శృతిలయలు సాంస్కృతిక సంస్థ "అభినందన మందారమాల" పేరుతో సమర్పించిన 17వ సినీ సంగీత విభావరి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అధ్యక్షులు గాయకులు చింతలపూడి నాగరాజు, లలితా శివ జ్యోతి, సమర్పణలో త్యాగరాయ గాన సభ కళా సంగీత నాట్య వేదికలో జరిగిన సంగీత విభావరి "నభూతో న భవిష్యతి." శు క్లాంబరధరం విష్ణుం అనే గణపతి ప్రార్థనతో నాగరాజు శర్మ, సుబ్బారావు, ప్రారంభించగా గాయనీ గాయకులు అద్భుతంగా పాత కొత్త పాటలు వినిపించి ప్రేక్షకులను అలరించారు. లలితా శివజ్యోతి పాడిన పూజలు చేయ పూలు తెచ్చాను, ఔత్సాహిక గాయకుడు తిరుపతి పాడిన అన్నమయ్య జననం, సుబ్బారావు పద్మావతి ఆలపించిన చుక్కల పల్లకిలో, మధురవాణి నాగరాజు జాబిల్లితో చెప్పనా జాము రాతిరి, పాటలు ప్రేక్షకుల మన్ననలు పొందాయి. తిరుపతి, అను పద్మలత, బలపం పట్టి బామ్మ బళ్లో అ ఆ ఇ ఈ దిద్దుకున్నారు. మల్లికార్జున్ రావు లలిత శివ జ్యోతి అందానికి అందానివై అంటే, శశికళ నాగరాజు కోకిల కోకిల కోయన్నది, అని పాడితే మధురవాణి భరత భూషణ్ ఈనాటి ఈ రాయి కల కాదోయి నిజంమోయి, అనే ఆపాతం మధురం వినిపించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. పద్మ నాగరాజు శర్మ కొమ్మకొమ్మకో సన్నాయి, అని పాడితే ఎం. ఎస్. లక్ష్మీ ఏక్ దో తీన్ చార్ పాంచ్ అనే పాటను అద్భుతంగా ఆలపించారు. లలితా శివ జ్యోతి సుబ్బారావు నీ చూపులోన అని పాడితే రమణ నీ చిలిపి కన్నులలోన అనే చిలిపి గీతాన్ని పాడి వినిపించారు. రమాదేవి భరత్ భూషణ్ ఏ రాగము ఇది ఏ తాళము అంటే ఎమ్మెస్ లక్ష్మీ సీతాపతి నన్ను ఎవరో తాకిరి కన్ను ఎవరో కలిపిరి అని పాడారు. సులక్షణ ఈ వేళలో నా నీవు ఏం చేస్తూ ఉంటావో, మెరుపులా మెరిసేవు అని మెరిశారు. సీతాపతి శైలజ బామిని, మల్లికార్జున్ శైలజ ఆలపించిన లే లే లే నా రాజా ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నాయి. రమణ శశికళ ఏలే ఏలే మరదలా శశికళ భరత్ భూషణ్ కురిసేను హృదయంలో అని పాట పాడి అలరించారు. తిరుపతి రీటా చిట్టిగుమ్మ పదవే రెండు రెక్కలు కట్టుకుందాం,అని పాడి అలరించారు. మల్లికార్జున రావు పాడిన పాటకు రమణ పాడిన పాటలకు, చిరంజీవి శృతి చేసిన డాన్స్ ప్రేక్షకులను కరతాళ ధ్వనులు అందుకుంది.




- కార్యక్రమానికి హైలైట్ మల్లికార్జున్ రావు ఈలపాట

ఈ కార్యక్రమంలో మల్లికార్జున్ రావు ఆలపించిన ఈలపాట కార్యక్రమానికే హైలైట్ గా నిలిచింది అని చెప్పవచ్చు. అక్కినేపల్లి రాంగోపాల్, ఎం. ఎస్.లక్ష్మితో కలిపి ఓ నెలరాజ వెన్నెల రాజా, రాంగోపాల్, రీటా దయాకర్ తో మేఘాలే తాకింది, లలితా శివజ్యోతి తో కలిసి నా ఇంటి ముందున్న పూదోటానడిగావు అనే పాటను పాడి ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమం చింతలపూడి నాగరాజు శర్మ వందన సమర్పణ తో ముగిసింది.


# ఎక్స్ లో పేరు మార్చుకున్న ఎలాన్ మస్క్

**వేద న్యూస్, డెస్క్:**

ప్రముఖ టెక్ దిగ్గజం, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ మరోసారి తన చర్యతో వార్తల్లో నిలిచారు. సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్ (గతంలో ట్విట్టర్)లో తన డిస్ప్లే పేరును ఆయన తాజాగా మార్చారు. 'ఎలాన్ మస్క్' స్థానంలో ఇప్పుడు 'గోర్క్ లాన్ రస్ట్' అని కనిపిస్తుండటంతో, ఈ కొత్త పేరు వెనుక ఆంతర్యం ఏమై ఉంటుందా అని నెటిజన్లు, టెక్ నిపుణులు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. ఎలాన్ మస్క్ తన ఎక్స్ ఖాతా ప్రొఫైల్ పేరును 'గోర్క్ లాన్ రస్ట్'గా మార్చడం వెనుక పలు కారణాలు ఉండవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇందులో ప్రధానంగా రెండు అంశాలు కనిపిస్తున్నాయి. ఒకటి, మస్క్ స్థాపించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కంపెనీ 'ఎక్స్ఏఐ' అభివృద్ధి చేసిన ఏఐ చాట్‌బాట్ 'గ్రాక్' రెండోది 'రస్ట్' ఇది ఎక్స్ఏఐ సాంకేతిక నిర్మాణంలో వినియోగిస్తున్నట్లుగా చెప్పబడుతున్న 'రస్ట్' ప్రోగ్రామింగ్ భాషకు సంకేతం కావచ్చని భావిస్తున్నారు. ఈ రెండు పదాల కలయికే 'గోర్క్ లాన్ రస్ట్' అని, తద్వారా తన ఏఐ ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు మస్క్ సూచిస్తున్నారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకిడే కి 42వ డివిజన్ వెంకటేశ్వర కాలనీ వాసులు వినతి పత్రం ఇచ్చారు. తమ కాలనీలో చిన్న చినుకు పడితే ఇంట్లో నుండి బయటికి వచ్చే లా ఉండదని కాలనీలో రోడ్లు లేక వాన పడితే మొత్తం సముద్రం తలపించేలా కాలనీ మారుతుందని పేర్కొన్నారు. దీంతో పాములు, తేళ్లు, ఇండల్లోకి వస్తున్నాయన్నారు. చిన్నపిల్లలు వృద్ధులు బయటకు రాలేని పరిస్థితికి తోడు సైడ్ కాలువలు త్రాగునీరి కనెక్షన్లు కూడా లేవు అని తమ గోడు కమీషనర్ కు వెళ్లబెట్టుకున్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో డా.బాల్నె వెంకటేశ్వర్లు, కోనూరు వేణుగోపాల్, శశి కుమార్, తాళ్ళపెల్లి సమ్మయ్య, కంజర్ల రాంబాబు,మాదాటి వెంకన్న గౌడ్, మంచోజు హరికృష్ణచారి, మంచోజు రామబ్రహ్మాచారి, కోడెం రవికుమార్ పాల్గొన్నారు.

# బిగ్ బాస్ యువతను తప్పుదారి పట్టిస్తోంది

**వేద న్యూస్, డెస్క్:**

సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ మరోసారి బిగ్‌బాస్ రియాలిటీ షోపై, హైదరాబాద్‌లో జరగనున్న అందాల పోటీలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తిరుపతిలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ రెండు కార్యక్రమాలు సమాజానికి, సంస్కృతికి హానికరమని ఆయన అభిప్రాయపడ్డారు. బిగ్‌బాస్ షో సమాజానికి ఏ మాత్రం ఉపయోగపడని కార్యక్రమమని నారాయణ విమర్శించారు. ఇది యువతను తప్పుదారి పట్టిస్తోందని, కళారంగానికి సైతం కళంకం తెస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. "బిగ్‌బాస్ వ్యవహారం చూస్తే.. చీప్ వ్యభిచారం వద్దు, కాస్ట్లీ వ్యభిచారం చేయండి అన్నట్టుంది" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. వివాహం కాని వారు ఒకే మంచం మీద పడుకోవడం వంటివి ప్రసారం చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమాన్ని 24 గంటలు ప్రత్యక్ష ప్రసారం చేస్తే ఇంకా దారుణమైన దృశ్యాలు చూడాల్సి వచ్చేదని అన్నారు. బిగ్‌బాస్ షోను నిషేధించాలని తాను గత కొంతకాలంగా ప్రయత్నిస్తున్నానని నారాయణ తెలిపారు.

# కులగణన: ఆవశ్యకత, సవాళ్లు

వేద న్యూస్, డెస్క్:

భారత దేశంలో కులగణన ఎప్పుడూ ఒక వేడి చర్చనీయాంశంగానే కొనసాగుతోంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత దేశంలో అన్ని కులాల సమగ్ర గణన జరగలేదు. 1951 నుండి 2011 వరకు జరిగిన జనాభా లెక్కలలో కేవలం షెడ్యూల్డ్ కులాలు, తెగల గణాంకాలను మాత్రమే సేకరించి ప్రచురించారు. ఇతర కులాల సమగ్ర గణన ఇప్పటి వరకు జరగలేదు. అయితే 2011లో సామాజిక, -ఆర్థిక కులగణన జరిగింది కానీ దాని ఫలితాలు ఇంకా అధికారికంగా విడుదల కాలేదు. ఇప్పుడు 2025లో జరగబోయే జనాభా లెక్కల్లో కులగణన ఉంటుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం ఈ అంశానికి మళ్లీ ప్రాధాన్యం సంతరించుకుంది. కులగణన ప్రాముఖ్యతను ఎవరూ కాదనలేరు. ఇది ముఖ్యంగా సామాజిక న్యాయం, సమానత్వం సాధించే దిశలో ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడుతుంది. ప్రస్తుతం విద్య, ఉద్యోగ రంగాల్లో అమలవుతున్న రిజర్వేషన్ల విధానం పాత జనాభా అంచనాలపై ఆధారపడి ఉంది. కులగణన ద్వారా ప్రతి కులం ఖచ్చితమైన జనాభా సంఖ్య తెలుస్తుంది. ఈ సమాచారం ఆధారంగా రిజర్వేషన్ల విధానాన్ని మరింత సమర్థవంతంగా, న్యాయంగా పునఃపరిశీలించే అవకాశం ఉంటుంది. ఏయే కులాలకు ఎంత ప్రాతినిధ్యం అవసరమో గుర్తించి ప్రస్తుతం సమాజంలో నెలకొన్న అసమానతలను తగ్గించవచ్చు. అంతేకాకుండా కులగణన వివిధ కులాల సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులపై సమగ్రమైన సమాచారాన్ని అందిస్తుంది. ఈ డేటా ఆధారంగా ప్రభుత్వం ప్రతి కులం ప్రత్యేక అవసరాలను గుర్తించి వారికి లక్షిత అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు రూపొందించవచ్చు. విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి కీలక రంగాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన కులాలను గుర్తించడం సులభమవుతుంది. ఇది వెనుకబడిన వర్గాల అభివృద్ధికి మరింత దోహదపడుతుంది.

కులగణన వెనుకబడిన కులాల వాస్తవ పరిస్థితిని సమాజానికి తెలియజేస్తుంది. ఇది సమాజంలో వారి స్థానాన్ని మెరుగుపరచడానికి, వారు ఎదుర్కొంటున్న వివక్షను రూపుమాపడానికి, వారి సాధికారతను పెంపొందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడానికి ఒక బలమైన పునాదిని అందిస్తుంది. చారిత్రక అన్యాయాలను సరిదిద్దడానికి ఇది ఒక ముఖ్యమైన అడుగుగా పరిగణించవచ్చు. వనరుల కేటాయింపులో కూడా కులగణన కీలకపాత్ర పోషిస్తుంది. వివిధ కులాల జనాభా నిష్పత్తి, వారి అవసరాలపై ఖచ్చితమైన సమాచారం ఉంటే ప్రభుత్వం విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి రంగాలకు నిధులను మరింత సమర్థవంతంగా కేటాయించగలదు. ఇది ప్రాంతీయంగా కులాల వారీగా ఉన్న అభివృద్ధి అంతరాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కులగణన డేటా సామాజిక శాస్త్రవేత్తలు, ఆర్థికవేత్తలు, ఇతర పరిశోధకులకు కుల వ్యవస్థ డైనమిక్స్‌ను అధ్యయనం చేయడానికి, వివక్ష మూలాలను గుర్తించడానికి సమర్థవంతమైన పరిష్కారాలను సూచించడానికి, ఒక విలువైన వనరుగా ఉపయోగపడుతుంది. ఇది విధాన రూపకర్తలకు ఆధారిత నిర్ణయాలు తీసుకోవడానికి సహాయపడుతుంది. భారత దేశం విశాల జనాభా, భౌగోళిక వైవిధ్యం కారణంగా సమగ్రమైన కులగణన నిర్వహించడం ఒక పెద్ద సవాలు. దేశంలో వేల సంఖ్యలో కులాలు, ఉపకులాలు ఉన్నాయి. వాటిని ఖచ్చితంగా వర్గీకరించడం ఒక పెద్ద సమస్య. ఒకే పేరుతో వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు సామాజిక స్థానాలు కలిగిన కులాలు ఉండవచ్చు. దీనికి స్పష్టమైన, ప్రామాణికమైన వర్గీకరణ మార్గదర్శకాలను అభివృద్ధి చేయడం అవసరం. భాషా, ప్రాంతీయ వైవిధ్యాలను పరిగణనలోకి తీసుకోవాలి. అవసరమైతే సాంకేతికతను ఉపయోగించి డేటాను విశ్లేషించాలి, నిపుణుల సలహాలు తీసుకోవాలి. కాలక్రమేణా వ్యక్తులు, సమూహాలు తమ కుల గుర్తింపును మార్చుకునే అవకాశం ఉంది. రిజర్వేషన్ల కోసం లేదా సామాజిక ఉన్నతి కోసం ఇలా జరగవచ్చు.

ఈ సమస్యను అధిగమించడానికి ప్రజల నుండి నేరుగా వారి కుల వివరాలను అడగడం, స్వీయ గుర్తింపును ప్రామాణికంగా తీసుకోవడం ఉత్తమం. డేటా సేకరణలో పక్షపాతం కూడా ఒక ముఖ్యమైన సవాలు. గణన సిబ్బంది వారి వ్యక్తిగత నమ్మకాలు లేదా అంచనాల ఆధారంగా తప్పుగా డేటా నమోదు చేసే అవకాశం ఉంది. దీనిని నివారించడానికి సిబ్బందికి కులం సున్నితత్వాన్ని ఖచ్చితమైన డేటా సేకరణ ప్రాముఖ్యతను తెలియజేస్తూ సమగ్రమైన శిక్షణ ఇవ్వాలి. పర్యవేక్షణ యంత్రాంగాన్ని బలోపేతం చేయాలి, యాదృచ్ఛిక తనిఖీలు నిర్వహించాలి. కులగణన రాజకీయంగా సున్నితమైన అంశం కాబట్టి తప్పుడు సమా చారం ఇవ్వడానికి లేదా డేటాను తారుమారు చేయడానికి ఒత్తిడులు ఉండవచ్చు. డేటా సేకరణ ప్రక్రియను పారదర్శకంగా ఉంచడం, డేటా భద్రత గోప్యతను నిర్ధారించడం చాలా ముఖ్యం. రాజకీయ జోక్యాన్ని నివారించడానికి స్వతంత్ర సంస్థల పర్యవేక్షణను ఏర్పాటు చేయాలి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. దీనిని అధిగమించడానికి ఆధునిక సాంకేతికతను ఉపయోగించడం, దశలవారీగా గణన నిర్వహించడం, వనరులను తెలివిగా కేటాయించడం అవసరం. ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం కూడా ముఖ్యమైనది. కులగణన ఉద్దేశం, దాని సంభావ్య ఉపయోగాల గురించి ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం వల్ల వారు తప్పుడు సమాచారం ఇవ్వవచ్చు లేదా సహకరించకపోవచ్చు. దీనిని అధిగమించడానికి విస్తృతమైన అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి. ప్రజల సందేహాలను నివృత్తి చేయాలి. మీడియా ప్రజా నాయకుల సహకారం తీసుకోవడం కూడా ఉపయోగపడుతుంది. చివరగా సేకరించిన కులాల డేటా గోప్యత, భద్రతను నిర్ధారించడం చాలా ముఖ్యం. డేటా లీక్ కావడం లేదా దుర్వినియోగం కావడం జరిగితే తీవ్రమైన పరిణామాలు ఉండవచ్చు. డేటా నిల్వ, నిర్వహణ కోసం కఠినమైన భద్రతా ప్రోటో కాల్‌లను అనుసరించాలి అధునాతన సాంకేతికతలను ఉపయోగించాలి. కులగణన సఫలం కావాలంటే అనేక జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం.

స్పష్టమైన లక్ష్యాలు, పరిధిని నిర్దేశించడం, సమగ్రమైన ప్రణాళిక వ్యూహం రూపొందించడం, ఖచ్చితమైన వర్గీకరణ వ్యవస్థను అభివృద్ధి చేయడం, సమర్థవంతమైన శిక్షణ ఇవ్వడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, పారదర్శకత పాటించడం, డేటా గోప్యతను నిర్ధారించడం, ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, రాజకీయ జోక్యాన్ని నివారించడం, నిపుణుల కమిటీని ఏర్పాటు చేయడం, క్రమానుగత పర్యవేక్షణ చేయడం వంటి చర్యలు తీసుకోవాలి. ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కులగణన మరింత విజయవంతం కాగలదు. సామాజిక న్యాయం సమానత్వం సాధనలో ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

# అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించండి

వేద న్యూస్, వరంగల్ టౌన్:




అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని రాష్ట్ర హౌసింగ్ ఏం డి విపి గౌతమ్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్ లు హౌసింగ్ పి డి లతో హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమర్థవంతం గా నిర్వహించడానికి తగు సూచనలు చేశారు. వరంగల్ నగరం నుండి కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎండి మాట్లాడుతూ నగరంలో జనాభా ప్రాతిపదికన ఇప్పటివరకు ఎంతమంది ఇందిరమ్మ ఇళ్ల కు అర్హులను గుర్తించారని క్షేత్ర స్థాయిలో వెరిఫికేషన్ అధికారులు ఇప్పటివరకు ఎన్ని గుర్తించారని గుర్తించిన వారి జాబితాను కలెక్టర్ లాగిన్ లోకి పంపించాలని అన్నారు. సమీక్షించి ఈ నెల 8 లోగా పూర్తి చేసి 10 వ తేదీ లోగా ప్రొసీడింగ్స్ అందించేలా చూడాలని నమోదు క్రమంలో పోర్టల్ లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఏం డి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ఆలి వేలు, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, రాజేశ్వర్, ఐ టి మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాకిస్థాన్‌కు నిధులు ఆపేయండి

**- పాకిస్థాన్‌పై దౌత్య ఒత్తిడి పెంచిన భారత్ -పాకిస్తాన్‌కు ఏడీబీ ఆర్థిక సహాయం నిలిపివేయాలన్న భారత్**

వేద న్యూస్, డెస్క్:

పహల్గామ్ మారణకాండ నేపథ్యంలో పాకిస్థాన్‌పై దౌత్యపరమైన చర్యలను భారత్ ముమ్మరం చేసింది. పాక్ కు అందుతున్న అంతర్జాతీయ ఆర్థిక సహాయాన్ని నిలిపివేయించే దిశగా భారత కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా, పాకిస్థాన్‌కు అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని తక్షణమే నిలిపివేయాలని ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ)ని కోరింది. ఇటీవల జరిగిన ఒక సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ విషయాన్ని ఏడీబీ అధిపతి మసటో కందాతో నేరుగా ప్రస్తావించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. పాకిస్థాన్‌కు ఆర్థిక సహకారం కొనసాగించవద్దని ఆమె స్పష్టంగా విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ఈ అంశంపై నిర్మలా సీతారామన్ ఇదివరకే ఇటలీ ఆర్థిక మంత్రితో చర్చలు జరిపారని, పలు ఇతర యూరోపియన్ దేశాలతో కూడా సంప్రదింపులు కొనసాగిస్తున్నారని ఆ వర్గాలు పేర్కొన్నాయి. అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్‌పై ఒత్తిడి పెంచే వ్యూహంలో భాగంగా, ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ గ్రే లిస్ట్‌లో పాకిస్తాన్‌ను చేర్చేందుకు భారత్ ప్రయత్నిస్తోంది.



దీంతో పాటు, ఇస్లామాబాద్‌కు వివిధ బహుళపాక్షిక సంస్థల నుంచి అందుతున్న నిధుల ప్రవాహంపై సమీక్ష జరపాలని భారత్ అంతర్జాతీయ సమాజాన్ని కోరుతోంది. ఈ దౌత్యపరమైన చర్యల ద్వారా, ఉగ్రవాదానికి ఊతమిస్తోందనే ఆరోపణలు ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌ను ఆర్థికంగా కట్టడి చేయాలనేది భారత్ ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది.

# మాక్ డ్రిల్స్ నిర్వహించాలని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం సూచన

వేద న్యూస్, డెస్క్:

పహల్గామ్‌లో ఇటీవల చోటు చేసుకున్న ఉగ్రవాద దాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. దేశవ్యాప్తంగా భద్రతా సంసిద్ధతను సమీక్షించి, పటిష్టం చేసే దిశగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలని, భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేయాలని సూచించింది భద్రతా పరమైన సంసిద్ధతను పరీక్షించేందుకు వీలుగా ఈ బుధవారం ప్రత్యేకంగా మాక్ డ్రిల్స్ నిర్వహించాలని కేంద్రం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కీలక సూచనలు జారీ చేసింది. అంతేకాకుండా, ఈ మాక్ డ్రిల్స్ సందర్భంగా భద్రతా సన్నద్ధతపై సాధారణ పౌరులకు కూడా అవగాహన కల్పించాలని కేంద్రం స్పష్టం చేసింది. ఏదైనా ఊహించని, అత్యవసర పరిస్థితి తలెత్తితే ఏ విధంగా స్పందించాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై ప్రజలకు తెలియజేయాలని సూచించింది.



# పారిశ్రామిక తిరోగతి!

వేద న్యూస్, డెస్క్:



గత నాలుగేళ్ళలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పారిశ్రామిక ఉత్పత్తిలో తగ్గుదల నమోదు కావటం భారత ఆర్థిక వ్యవస్థకు ఒక ప్రమాద ఘంటిక. సామాన్య ప్రజల కొనుగోలు శక్తి నానాటికీ తగ్గుతున్న దాని పర్యవసానమే ఈ పరిస్థితి! భారత ఆర్థిక వ్యవస్థ అద్భుతంగా పురోగమిస్తున్నదని గత కొంతకాలంగా ఢంకా భజాయిస్తున్న మోడీ సర్కారు పనితీరుకు ఇది అక్షరాలా ప్రతికూల నివేదిక. ప్రజల ఆర్థిక స్థితి రోజురోజుకూ దిగజారుతున్నదని, గత్యంతరం లేని పరిస్థితుల్లో- ప్రజలు తమ రోజువారీ జీవన వ్యయాన్ని కూడా తగ్గించుకుంటున్నారని కేంద్ర గణాంకాల శాఖ విడుదల చేసిన పారిశ్రామిక ఉత్పత్తి సూచి (ఐఐపి) తేటతెల్లం చేస్తోంది. గడిచిన ఆర్థిక సంవత్సరం ప్రధాన పారిశ్రామిక రంగాలన్నీ ఉత్పత్తిలో గణనీయంగా తగ్గుదలను నమోదు చేశాయి. కోవిడ్ ఉత్పాతం తరువాత ఇంత తక్కువ వృద్ధి రేటు నమోదు కావడం ఇదే మొదటిసారి. 2021 -22లో 11.4 శాతంగా నమోదైన వృద్ధి రేటు ఈ ఏడాది 4 శాతానికే పరిమితం అయింది. 2023 - 24 ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూసినా ఇది 1.9 శాతం తక్కువగా ఉంది. మేకిన్ ఇండియా పేరిట కేంద్ర ప్రభుత్వం హడావిడి చేస్తున్నప్పటికీ- అంకెల్లో వ్యక్తమవుతున్న వాస్తవ దృశ్యం ఇదీ! ప్రజల ఆదాయాన్ని పెంచే చర్యలు చేపట్టకుండా పాలకులు ఎన్ని ప్రగల్భాలు పలికినా ఫలితం ఉండదు అనటానికి ఐఐపి నివేదిక నిదర్శనం. మోడీ ప్రభుత్వం కార్పొరేటు అనుకూల విధానాలను నెత్తిన వేసుకొని, ప్రైవేటీకరణను పెద్దఎత్తున ప్రోత్సహిస్తోంది. అంబానీ, అదానీ తదితరులకు లాభాలను దోచిపెట్టేలా పనిగట్టుకొని ప్రభుత్వరంగ సంస్థలను దెబ్బ తీస్తోంది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని దేశ యువతకు ఆశ కల్పించి, గద్దెనెక్కాక ఆ మాటనే పూర్తిగా మర్చిపోయింది. ప్రజలు దానిని గుర్తు చేస్తుంటే- జీవన ప్రమాణాల మెరుగుదలకు ఏవిధంగానూ దోహదపడని ఉన్మాదం, ఉద్రేకాల వైపు యువతీ యువకులను మళ్లిస్తోంది. ఉదార ఆర్థిక విధానాల్లో భాగంగా శాశ్వత నియామకాలకు స్వస్తి చెప్పి, అన్నింటా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగు పద్ధతుల్లోనే ఉద్యోగులను నియమిస్తోంది. ఆఖరికి దేశభద్రతకు అత్యంత కీలకమైన రక్షణరంగంలోనూ లక్షలాది పోస్టులూ ఖాళీగా ఉన్నా- అగ్నివీర్ పేరిట తాత్కాలిక నియామకాలతోనే కాలయాపన చేస్తోంది. గ్రామీణ ప్రజలకు కాస్త ఆదాయాన్ని గ్యారంటీ చేసే ఉపాధి హామీ చట్టాన్ని ఏటేటా నిధులు తగ్గించటం ద్వారా నిర్వీర్యం చేస్తూ వస్తోంది. గ్రామీణ భారతానికి వెన్నెముకలా ఉన్న వ్యవసాయరంగం రాయితీల తగ్గింపు, అరకొర మద్దతు ధరతో నానాటికీ కుదేలవుతోంది. సాఫ్ట్‌వేర్ మొదలుకొని ప్రతి ప్రైవేటు, కార్పొరేటు రంగంలోనూ ఉద్యోగులపై పనిభారం పెంచటం, నిజవేతనాలు తగ్గించటం కొన్నేళ్లుగా సాగుతోంది. వీటన్నింటి పర్యవసానంగా ప్రజల ఆదాయాలు తగ్గి, కొనుగోలు శక్తి క్షీణించిపోతోంది. ఆహారం, బట్టలు తదితర రోజువారీ వినియోగ వస్తువులపై ప్రజల ఖర్చు గతేడాదితో పోలిస్తే 4.7 శాతం తగ్గినట్టు కన్జూమర్ నాన్ డ్యూరబుల్ పద్దు స్పష్టం చేస్తోంది. రోజువారీ అవసరాలను తీర్చుకోలేని స్థితిలో ప్రజలున్నారని చెప్పటానికి ఇది సూచిక. వాహనాలు, గృహోపకరణాలు వంటి వినిమయ వస్తువుల ఉత్పత్తి కూడా మందగించింది. నెలవారీ చెల్లింపుల (ఇఎంఐ) పద్ధతిని కంపెనీలు ప్రోత్సహిస్తున్నాయి కాబట్టే- ఈ రంగంలో ఈపాటి కొనుగోళ్ళు అయినా జరుగుతున్నాయి. ఆర్థికమాంద్యం ఆవరిస్తున్న పరిస్థితుల్లో రానున్న కాలంలో పారిశ్రామిక ఉత్పత్తి మరింత క్షీణించే ప్రమాదముందని ఆర్థికవేత్తల హెచ్చరిక. అమెరికా విధిస్తున్న పన్నుల భారం కూడా మన ఎగుమతులపై తీవ్రంగా ఉంటుంది. ఆక్వా తదితర రంగాలపై ఆ ప్రభావం ఇప్పటికే పడింది. ఈ నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి గురించి కబుర్లతోనే కాలక్షేపం చేయకుండా- క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలకు అనుగుణంగా వ్యవహరించాలి. ప్రజల నిజ వేతనాలను పెంచే ముమ్మర చర్యలు చేపట్టాలి. పైకి ఆడంబరంగా కనిపించే ఉదార ఆర్థిక విధానాలు కార్పొరేట్లకు లాభాలు కురిపించి, సామాన్యులకు అంతకుమించిన కష్టనష్టాలను చవిచూపిస్తాయన్న వాస్తవం ఇప్పటికే ఆచరణలో తేలిపోయింది. వ్యవసాయ రంగాన్ని, ప్రభుత్వరంగాన్ని బలోపేతం చేయడం ద్వారా ప్రజల కొనుగోలుశక్తిని పెంచాలి. తద్వారా పారిశ్రామిక, ఆర్థిక రంగాలను మెరుగుపరచాలి.

వేద న్యూస్

మంగళవారం మే 06, 2025

## బిఆర్ఎస్ మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా దాసి శ్రావణ్ కుమార్



**వేద న్యూస్, శాయంపేట :**

బిఆర్ఎస్ పార్టీ మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా మండలంలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన దాసి శ్రావణ్ కుమార్ నియమించినట్లు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ రూరల్ మాజీ జెడ్పి చైర్ పర్సన్ గండ్ర జ్యోతి ఆదేశాల మేరకు దాసీ శ్రావణ్ కుమార్‌ను నియమించినట్లు ప్రకటించారు. మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా అవకాశం కల్పించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతులు, మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు మనోహర్ రెడ్డికి శ్రావణ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

## వ్యక్తి అదృశ్యం



**వేద న్యూస్, కాజీపేట :**

మండలోజు వెంకటేశ్వర్లు, తండ్రి పాప చారి,వయస్సు 70 సంవత్సరాలు, నాగోల్ హైదరాబాద్ అను వ్యక్తి తప్పిపోయాడని కాజీపేట సిఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. 20 రోజుల క్రితం బిడ్డ ఇంటి వద్దకు వచ్చినాడని, సోమవారం తన బిడ్డ ఇంటి వద్ద నుండి ఉదయం 5 గంటలకు బయటకు వెళ్లి తిరిగి రాకపోయేసరికి అతని అల్లుడు అయిన ముడుపు హరీష్, దర్గా రోడ్డు కాజిపేట సంబంధించిన వ్యక్తి ఇచ్చిన దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## సినీ నటుడు విజయ్ గిరిజన జాతికి క్షమాపణ చెప్పాలి



**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

గిరిజనుల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు విజయ దేవరకొండ యావత్ గిరిజన జాతికి క్షమాపణ చెప్పాలని నంగారా బేరి లంబాడి హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు ముడావత్ పుట్టంగండి శ్రీనివాస్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం నాడు ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ గత ఏప్రిల్ 26న జరిగిన "రెట్రో" సినిమా ఫ్రీ రిలీజ్ ఈవెంట్‌లో విజయ్ దేవరకొండ చేసిన వ్యాఖ్యలు గిరిజనుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతీశాయని అన్నారు. 500 సంవత్సరాల కిందట వారు బుద్ధి లేకుండా కొట్టుకున్నారు. అనే వ్యాఖ్యలతో పాటు ఉగ్రవాదులతో గిరిజనులను పోల్చేలా మాట్లాడడం అసహ్యకరమైనదని హేయమైనదని అన్నారు. ప్రకృతి ఒడిలో అడవి జాతి బిడ్డలుగా కాయకష్టమే లక్ష్యంగా పనిచేసే లంబాడి జాతిని తన మాటలతో కించపరిచిన విజయ్ దేవరకొండ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం శిక్షార్హులు అవుతారని శ్రీనివాస్ నాయక్ పేర్కొన్నారు.



## అష్టలక్ష్మి దేవాలయ బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న డిప్యూటీ ఫ్లోర్ లీడర్

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో 29వ (ఏకో నత్రింశత్) ఇష్టిసహిత బ్రహ్మోత్సవాలు సోమవారం నుండి ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో రామకృష్ణ పురం డివిజన్ మాజీ కార్పొరేటర్ (జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్) దేపా సురేఖ భాస్కర్ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుకా ఉపేందర్ రెడ్డి, దేవాలయ చైర్మన్ సోమా సురేష్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, కమిటీ సభ్యులు దాచేపల్లి శ్రీనివాస్, గౌరీశెట్టి అరుణ్ కుమార్, శ్రీధర్, శ్రీనివాస్, విప్లవ రెడ్డి పాల్గొన్నారు.

## ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలి



**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:**

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కరిస్తూ బాధితు లకు అండగా ఉంటూ ఫిర్యాదుల పై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకో వడం జరుగుతుందని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె నరసింహ ఐపిఎస్ అన్నారు.సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పిర్యాదు దారులతో మాట్లాడి వారి అర్జిలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పిర్యాదుదారులకు బరోసా కల్పించాలని, ప్రతి అంశాన్ని చట్ట పరిదిలో పరిష్కరించడంలో, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు.

## ప్రభుత్వ పథకాలన్నీ అధికార పార్టీ కార్యకర్తలకేనా..?

**మొదటి పేజీ తరువాయి**

ఊరుకోమని కోర్టుకు వెళ్లి మరీ న్యాయపరంగా కొట్లాడుతామని అవసరమైతే పేద ప్రజల బాగు కోసం ఎంతకైనా తెగించి కొట్లాడుతామని స్పష్టం చేశారు. కమలాపూర్ ఎంపీడీవో నిజాయితీ కలిగిన మంచి అధికారి అని అలాంటి అధికారులను కూడా అధికార పార్టీ నాయకులు ఒత్తిడి చేసే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి ఒత్తిళ్లకు అధికారులు ఎవరూ తలొగ్గాల్సిన అవసరం లేదని, ప్రభుత్వాలు ప్రతి ఐదేళ్లకోసారి మారుతాయని అధికారులు మాత్రం ఎప్పటికీ ఉంటారని, ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని నిజమైన లబ్దిదారులను గ్రౌండ్ లెవెల్ లో ఒకటికి రెండుసార్లు ఎంక్వయిరీ చేసి పేదవాడికి న్యాయం చేసేట్లు అధికారులు కూడా పనిచేయాలని ఈ సందర్భంగా అధికారులను కూడా కోరారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర జన్మదిన వేడుకలు

**వేద న్యూస్,శాయంపేట:**



శాయంపేట మండల కేంద్రంలో భూపాలపల్లి అభివృద్ధి ప్రదాత, ప్రజానాయకుడు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గారి జన్మదిన వేడుకలు జరిపిన బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి ,మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి వారి ఆధ్వర్యంలో శాయంపేట మండల కేంద్రంలో కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేయడం జరిగింది. అనంతరం గవర్నమెంట్ హాస్పిటల్ కి వెళ్లి రోగులకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ శాసనసభ్యులు గండ్ర వెంకటరమణారెడ్డి ఆయురారోగ్యాలతో ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటూ, భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలకు ఎంతో సేవ చేయాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వంగల నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి, మండల సోషల్ మీడియా కన్వీనర్ దాసి శ్రావణ్ కుమార్, మండల యూత్ అధ్యక్షులు మారేపల్లి మోహన్, గ్రామ శాఖ అధ్యక్షులు గాదె రాజేందర్, మేకల వెంకటేశ్వర్లు,సవాసి రమేష్, చల్లా శ్రీనివాస్ రెడ్డి, పసుల ప్రవీణ్, చిలుకయ్య, పిఏసిఎస్ చైర్మన్ కుసుమ శరత్, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు మేకల శ్రీనివాస్, మాజీ సర్పంచులు వలపదాస్ చంద్రమౌళి, బొమ్మకంటి సాంబయ్య, రఘుపతి రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ మారపల్లి నందం, గడిపె విజయ్, ధైనంపల్లి సుమన్,పోతు రమణారెడ్డి, సావుళ్ళ కిష్టయ్య, నర్ర రాజు, ఆకుల లక్ష్మణ్, కల్వాల శ్యామాజీ, అట్ల తిరుపతి, రంగు మహేందర్,కొమ్ముల రాకేష్,కరుణ్ బాబు, పైండ్ల భానుచందర్, పైండ్ల శంకర్, పైండ్ల శ్రీనివాస్, కోగీల రవికిరణ్, కుతాటి రమేష్, మామిడి శంకర్, ప్రశాంత్, ఆదిరెడ్డి, నారాయణరెడ్డి, రామరాజు, రమేష్, మొగిలి, సుభాష్, వైద్యుల సాంబరెడ్డి, మస్కి సుమన్, నాగరాజు, దేవయ్య, రేణిగుంట్ల సంతోష్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైకోర్టు జడ్జికి సంతాపం


**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**



తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి గిరిజా ప్రయదర్శిని ఆకస్మిక మృతి పట్ల సోమవారం మెట్ పల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, తాను మంథని జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేసినప్పుడు, కరీంనగర్ ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జిగా వున్నా ప్రియదర్శిని అందించిన సహకారం, ప్రోత్సాహం మరువలేనిది అన్నారు. ఆమె ఆకస్మిక మృతి జీర్ణం చేసుకోలేకపోతున్నామని, ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసారు. మెట్ పల్లి సబ్ కోర్టు ఏర్పాటు లో కూడా ఆమె పాత్ర అమోఘం అని, మేడం చొరవ చూపకుంటే ఇప్పటికీ మెట్ పల్లి సబ్ కోర్టు ఏర్పాటు అయ్యుండేది కాదని మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గడ్డం శంకర్ రెడ్డి గుర్తు చేసారు. ఆమె చేసిన సేవల గుర్చి సీనియర్ న్యాయవాదులు రాజ్ మహ్మద్, జిల్లా వెంకటేశ్వర్లు, వెంకట నర్సయ్య, వెంకట స్వామి లు వివరించారు. అనంతరం న్యాయవాదులు ఆమె మృతికి సంతాపసూచకంగా విధులకు దూరంగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి నారం అరుణ్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తోగిటి రాజశేఖర్, గజెల్లి రామ్ దాస్, పడిగేలా శ్రీనివాస్, యుద్ధవీర్, బర్ల లక్ష్మణ్, సోమ భూమేశ్వర్ మరియు బార్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

# సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

**వేద న్యూస్, సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి :**



సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం లాంటిదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పర్యటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. సోమవారం తన నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా సూర్యాపేట నియోజకవర్గానికి చెందిన వివిధ గ్రామాలకు చెందిన 11 మంది లబ్దిదారులకు 4 లక్షల 47500 రూపాయల సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో సిఎం ఆర్ ఎఫ్ పథకం ద్వారా పేదల ఆరోగ్యానికి అత్యదిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో వైద్యం, విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల్లోనే 1000 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ నిధులను ఇచ్చిందని కానీ పది సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఇవ్వలేదని విమర్శించారు.సిఎం ఆర్ ఎఫ్ పథకం అనారోగ్యంతో బాధపడుతున్న వారు చికిత్స కోసం తమను సంప్రదిస్తే ఈ పథకం ద్వారా సహాయం చేస్తామని చెప్పారు. సిఎం ఆర్ ఎఫ్ పథకం ద్వారా నిధుల విడుదలకు సహకరించిన జిల్లా ఇంఛార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నల్గొండ ఎంపి రఘువీర్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డికి సన్మానం

**వేద న్యూస్, సూర్యపేట ప్రతినిధి :**



బీహార్ హమాలీలు కలిసికట్టుగా ఉండి పనులు పూర్తి చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట పట్టణ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి కి బీహార్ హమాలీలు ఘనంగా పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుండి 300 మంది హమాలీలు రమేష్ ఆధ్వర్యంలో వచ్చి ఐకెపి, రైస్ మిల్లర్లు, వ్యవసాయ మార్కెట్‌లలో పనిచేయడం అభినందనీయమన్నారు. ఇక్కడ ఉన్న హమాలీలు కూడ పోటీ తత్వంలో ముందుండి పనిచేయాలని అన్నారు. రైతులు పండించే పంటను ఎగుమతి దిగుమతి చేస్తూ అందరికీ అందుబాటులో ఉండి సేవలు అందించాలని కోరారు. కమిషన్ దారులకు నమ్మకంగా ఉండి పనిచేయాలని తెలిపారు. రైతులతో హమాలీలు కలిసిమెలిసి ఉండాలన్నారు.హమాలీలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా నాకు వెంటనే తెలియపరచాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ హమాలీ సంఘం మేస్త్రీ రమేష్ శర్మ, రూదల్, మనోజ్, మక్కాం, అజయ్ ముఖి, అనిల్, పవన్, హాసిక్, ప్రకాష్ జాదవ్,పిసిల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# గింత నిర్లక్ష్యమా?

**మొదటి పేజీ తరువాయి**

అవ్వకుండా ప్యాడ్ అమర్చుతారని తెలిపారు. మూడు నాలుగు రోజుల తర్వాత మళ్లీ హాస్పిటల్‌కి రమ్మని చెప్పి ఆ తర్వాత ప్యాడ్ ను తొలగిస్తారని వెల్లడించారు.

### అసలేది నిజం..?

డాక్టర్ చెప్పేది వాస్తవమే అయితే బాలింతకు కడుపు లోపల ప్యాడ్ అమర్చినప్పుడు బాలింతకు కానీ, బాలింత బంధువులకు కానీ వైద్యులు కానీ వైద్య సిబ్బంది కానీ విషయం తెలియజేస్తారు. కానీ, అటువంటి ఏ సమాచారం ఎవరూ ఎవరికీ తెలియజేయలేదు. నిజంగా బాలింతకు కానీ, బంధువులకు కానీ అలాంటి సమాచారం తెలియజేస్తే వారు వైద్యులు చెప్పిన సమయానికి వచ్చి కడుపులో అమర్చిన ప్యాడ్ తీయించుకుని వెళ్లేవారు. ఇలా ఆరోపణ చేయాల్సిన అవసరం, ఆందోళన చేసే అవసరం కానీ బాధితులకు ఉండేది కాదు. దీన్నిబట్టి చూస్తే బాధితులు ఆరోపిస్తున్న ఆరోపణలు వాస్తవమేననే భావన కలుగుతుందని ఇది పూర్తిగా వైద్యులు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యమేనని కొట్టొచ్చినట్టు కనబడుతుందని బాధితుల తరఫున పలువురు అభిప్రాయపడ్డారు.

### ఘటనపై డీఎంహెచ్‌వో విచారణ

హనుమకొండ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కమలాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చోటు చేసుకున్న దారుణ ఘటనపై ఎంక్వయిరీ చేయడానికి హన్మకొండ డీఎంహెచ్‌వో అప్పయ్య సోమవారం కమలాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కలెక్టర్ ఆదేశాల మేరకు తాను ఇక్కడికి వచ్చానని చెప్పారు. ఈ ఇన్సిడెంట్‌పై ఎంక్వయిరీ చేసిన అనంతరం పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని వెల్లడించారు.



## 'నన్ను కోసినా, రూపాయి రాదు..'

**మొదటి పేజీ తరువాయి**



అపాయింట్‌మెంట్ కోరితే కూడా ఇవ్వట్లేదు. చెప్పులు కూడా ఎత్తుకపోతారేమో అనిపిస్తోంది. దేశం ముందు తెలంగాణ పరిస్థితి హీనంగా ఉంది," అని ఆవేదన వ్యక్తం చేశారు.

అంతే కాదు, సరిగా పనులు చేయాలంటే కూడా వనరులు లేవని చెప్పారు. "రోడ్లు వేయాలని అనుకుంటే అణాపైసా లేదు. కాంట్రాక్టర్లకు అప్పుల బకాయిలు వెయ్యి కోట్లకైనా ఇవ్వలేక పోతున్నాం. ఓ కుటుంబం ఆర్థికంగా పూర్తిగా దివాలా తీస్తే ఎలా ఉంటుందో... ఇప్పుడు మన రాష్ట్ర పరిస్థితి అలాగే ఉంది. గత పాలకులు వెనక్కి పెట్టిన రూ.8,500 కోట్ల రిటైర్మెంట్ బకాయిలను తీర్చాల్సిన బాధ్యత మాది. అలాంటిది... గతంలో ఎప్పుడూ జరగనట్టు, నెల మొదటివారంలోనే జీతాలు ఇచ్చే ప్రభుత్వంపైనే ఉద్యోగ సంఘాలు సమరం ప్రకటించడమేంటి?" అని ఆయన ప్రశ్నించారు.

"ప్రభుత్వం అంటే మేము ఒక్కరమే కాదు. మనమంతా కలిసి పనిచేసినప్పుడు మాత్రమే ఇది ప్రజాప్రభుత్వంగా నిలుస్తుంది. మీరు బాధ్యతగా వ్యవహరించాల్సిన వేళ, మీరు బాధ్యత మరచిపోతే... ఈ సమాజం సహించదు. ఇది ప్రభుత్వంపై కాదు, ప్రజలపైనే యుద్ధం అవుతుంది. ఆర్థిక విధ్వంసం చేసిన వాళ్లు ఇప్పుడు ఫామ్ హౌస్‌ల్లో హాయిగా పడుకున్నారు. కానీ నేను %-% ఆదాయానికి మించి ఏమీ చేయలేను. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాయపడింది. నన్ను కోసినా 18,500 కోట్ల ఆదాయం దాటడం లేదు. అవసరం మాత్రం 22,500 కోట్లు. ఇప్పుడు చెప్పండి %-% ఏ పథకం ఆపాలి? బోనస్ తీసేయాలా? విద్యుత్ ఖాతాలు తీయాలా?" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

"కేవలం పదహారు నెలల్లో 30 వేల కోట్ల నగదు రైతుల ఖాతాల్లో వేయగలిగాం. విద్యుత్ శాఖ, సింగరేణి, కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించాల్సిన పరిస్థితి మాకుంది. 11 శాతం వడ్డీతో అప్పులు తెచ్చిన గత పాలకుల పాపాల్ని మేమే భరించాలి. మీరు ధర్నాలు చేస్తే రాష్ట్రం కుప్పకూలుతుంది. ఇది సమరం చేయాల్సిన కాలం కాదు.. ఇది సంయమనం పాటించాల్సిన సమయం. సమస్యలు ఉంటే చర్చిద్దాం. కానీ పావులుగా మారకండి. రాజకీయ కుట్రల్లో మునిగిపోకండి. మన ప్రభుత్వం మన కుటుంబం. ఆ కుటుంబ పరువు బజారున పడేయొద్దు. ఇప్పుడు సమరం కాదు.. సమయస్ఫూర్తి కావాలి. మళ్లీ తెలంగాణను కోతుల గుంపుకు అప్పగించొద్దు. నాతో కలిసి రండి. తెలంగాణను అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళదాం," అని పిలుపునిచ్చారు.

### పోలీసుల పేరుతో పొలిటికల్ పాయింట్స్..

"పోలీసులు దేశ సరిహద్దుల్లోని జవాన్లలా పనిచేస్తున్నారు" అంటూ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలూ, ప్రస్తుతం పోలీసు శాఖను రాజకీయ ప్రయోజనాలకోసం వాడుకుంటున్నారన్న విమర్శలకు దారితీస్తున్నాయి. ఎక్కడైతే ఉద్యోగ సంఘాలు తమ హక్కుల కోసం పోరాడుతుంటే, అదే సమయంలో ముఖ్యమంత్రి పోలీసుల సేవలు పొగుడుతూ ప్రసంగించడం ప్రజల దృష్టిని మళ్లించడానికే అనే అనుమానాలు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఉందని చెబుతూ.. గత ప్రభుత్వంపై వేల కోట్లు బకాయిలు పెట్టారని ప్రస్తావించినా, ఇప్పటిదాకా తాను పాలనలో చేసిన ప్రతిష్టాత్మక వ్యయాలపై ఒక్క మాట కూడా లేదన్నది ప్రజల ప్రశ్న. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, డబుల్ బెడ్రూం ఇండ్లు, రైతు భరోసా, బీసీ గ్యారంటీ వంటి వాటిపై మౌనమే తప్పా, ఆచరణ లోపించింది అన్న అభిప్రాయం ప్రజల్లో వెల్లివిరుస్తోంది.

### ఉద్యోగులపై విమర్శల దాడి..

### ప్రభుత్వానికి మేలు చేస్తుందా?

ఊహించని స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులు నిరసనలో ఉన్న సమయంలో, "కుటుంబ పరువు బజారున పడేయొద్దు", "పెద్ద కోతుల గుంపుకు తెలంగాణను అప్పగించొద్దు" వంటి పదజాలం వాడటం ముఖ్యమంత్రి స్థాయికి తగదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మద్దతు ఇవ్వాల్సిన బాధ్యత ఉన్న సీఎం, ఉద్యోగ సంఘాలపై దాడికి దిగితే, పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉంది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073